

ఎంఈవో కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు

# చినుకుపడితే చిత్తడే..

ధన్వాడ, జూన్ 13: మండలంలోని ఆనేక గ్రామాల్లో రోడ్లు చినుకుపడితే చాలు చిత్తడిగా మా రుతున్నాయి. వర్షంనీరు రోడ్లపై నిలిచి దోమలకు నిలయంగా మారుతున్నాయి. మండలంలోని మంత్రోనిపల్లి గ్రామంలో రచ్చకట్ట వద్ద గుంతలు ఏర్పడి వర్షంనీరు నిలిచింది. వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పారిశుధ్యం లోపించిందని, దీనిగురించి ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే ధన్వాడలో ఎంఈవో కార్యాలయం ఎదుట వర్షంనీరు నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ప్రజలు రోగాలబారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



మంత్రోనిపల్లి రచ్చకట్ట వద్ద నిలిచిన వర్షపు నీరు

## నీట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- పరీక్షలో అవకతవకలపై ఏబీవీపీ నిరసన



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలియజేస్తున్న ఏబీవీపీ నాయకులు

పాలమూరు, జూన్ 13: నీట్ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకోవడంపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పాలమూరు జిల్లా విభాగం ఆధ్వర్యంలో గురువారం మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ సతీశ్‌తేజ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 23లక్షల మంది విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. వైద్యవిద్య చరిత్రలో ఎన్నడూలేనంతగా 67 మంది విద్యార్థులకు ఫస్ట్ ర్యాంకు వచ్చిందన్నారు. ఈ విద్యార్థులలో 8మంది హర్యాణాకు చెందిన ఒకే ఎగ్జామ్ సెంటర్ విద్యార్థులు కావడం ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. కొన్ని ఎగ్జామ్స్ సెంటర్లలో ఆలస్యంగా ప్రారంభించడం వలన, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ.. వారికి అదనంగా మార్కులు కలిపిందని, ఈ మార్కులు ఏ ప్రాతిపదికన కలిపారో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వివరణ ఇవ్వలేకపోతున్నదని అన్నారు. నీట్ పరీక్షలో 717, 718మార్కులు రావడం, అలాగే జూన్ 14న విడుదల చేయాల్సిన ఫలితాలను, జూన్ 4న విడుదల చేయడం చూస్తుంటే తప్పిదం జరిగిందని తెలుస్తున్నదన్నారు. వీరి చర్యల వ ల్ల లక్షలాది మంది నీట్ విద్యార్థులకు అ న్యాయం జరిగిందని, నష్టపోయిన వారికి న్యాయం చేయాలని ఏబీవీపీ డిమాండ్ చే స్తున్నదని, గందరగోళానికి కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు శివ, అరవింద్, వరుణ్, నవీన్, కార్తీక్, శ్రీధర్, బలరాం పాల్గొన్నారు.

## సంప్రదాయ కళలపై ఆసక్తి పెంచుకోవాలి



రామకృష్ణ కళ్యాణిని సన్మానిస్తున్న సిబ్బంది

నారాయణపేట టౌన్, జూన్ 13: చిన్నారులు సంప్రదాయ కళలపై ఆసక్తి పెంచుకోవాలని బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి అన్నారు. బాలకేంద్రంలో 41రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారులకు తబలా వాయిద్యంలో ఉచితంగా శిక్షణ ఇచ్చిన రామకృష్ణ కళ్యాణిని గురువారం బాలకేంద్రం సిబ్బంది పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత శిక్షణ ఇచ్చిన రామకృష్ణ కళ్యాణికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్, వసంత్‌కుమార్, నర్సింహులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

SIFEL MINERALS PVT. LTD. Vacancies at Thirumalaiahpally (V), Bhoothpur, Telangana. 1.Industrial Electrician for Minor Factory Repairs, 2. Accountant for GST Billing, Sales Record maintenance and reporting. Ph: 9118126666. NT-333883

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified 4 lines Advt Rs. 200/- Only (B/W)
Additional Line 50/- Only
For Advertisement Enquiry Please Contact...
9182777641
9182777654
9182777794

# ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 13: ప్రజల దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ నుంచి వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించి ధరణి పెండింగ్ దరఖాస్తులు, మీసేవ, ప్రజావాణి, ఇసుక పెనాల్టీ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ధరణి పోర్టల్ ద్వారా పెండింగ్ దరఖాస్తులకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు, ఆర్‌డీవోలు, తాసీల్దార్‌లు ఎక్కువ సమయం కేటాయించి, పెండింగ్‌లో ఉన్న పాత దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. తాసీల్దార్‌లు క్షేత్రస్థాయిలో సర్వే వెరిఫికేషన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు మండలాల వారీగా సమీక్షించి పరిష్కరించాలని, ఇసుక పెనాల్టీలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో నవీన్, గనులు, భూగర్భ శాఖ అధికారి సంజయ్ పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనుల పరిశీలన

ధన్వాడ, జూన్ 13: నారాయణ పేట జిల్లాలోని ధన్వాడ, నారాయణ పేట రూరల్ పోలీస్ స్టేషన్ నూతన భవనాల నిర్మాణం పనులను గురువారం ఎస్పీ యోగేశ్ గౌతమ్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎస్‌హెచ్‌వో గది, రిసెప్షన్, పోలీస్ స్టేషన్ ఆవరణ ఫిర్యాదుదారులకు తగిన వసతి సౌకర్యాలు కల్పించేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. మిగిలిన పనులు వేగవంతం చేయాలన్నారు. త్వరగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి, ధన్వాడ, నారాయణపేట రూరల్ ఎస్సైలు రమేశ్, కృష్ణదేవ్ పాల్గొన్నారు.



ధన్వాడ పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్

## 'కల్యాణలక్ష్మి'పై నిర్లక్ష్యం వహించొద్దు

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ





గండీడ్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

గండీడ్, జూన్ 13: అర్హులైన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి పథకం వర్తింపజేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో గండీడ్, మహ్మదాబాద్ మండలాలకు సంబంధించి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్లల పెళ్లిళ్లు చేసిన తల్లిదండ్రులు కల్యాణలక్ష్మి చెక్కుల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చెక్కుల మంజూరులో జాప్యం చేస్తున్నారని, వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. గ్రామాల్లో కరెంటు సమస్యలు మంచినీటి సమస్యలు రాకుండా చూడాలని పలువురు ఎంపీటీసీలు అధికారులను కోరారు. వర్షాకాలంలో అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గ్రామస్తులు సహకరించాలని, మురుగు నిల్వ ఉండకుండా ఇంకుడుగుంతలు త వ్వించాలని ఏపీవో హరిశ్చంద్రుడు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, పీఏసీసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, తాసీల్దార్ నాగలక్ష్మి, మహ్మదాబాద్ డిప్యూటీ తాసీల్దార్ శేఖర్, ఎంపీవో శంకర్‌నాయక్‌తోపాటు ఆయాగ్రామాల ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

# అక్షరాస్యత పెంపే ప్రభుత్వ లక్ష్యం

- మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి



జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

మక్తల్, జూన్ 13: అక్షరాస్యతలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మక్తల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందించారు. అనంతరం జెడ్పీ బాలుర పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి సర్కారు బడిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంలో ఈ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటయ్య, జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

***రోగులకు అన్ని వసతులు కల్పించాలి***

ప్రభుత్వ దవాఖానలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే శ్రీహరి అన్నారు. మక్తల్ నియోజకవర్గం నర్వలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే తనిఖీ చేశారు. కేంద్రంలో రోగులకు అవసరమైన అన్ని వసతులు కల్పించి, మెరుగైన వైద్యం అందించాలని డ్యూటీ డాక్టర్‌కు చెప్పారు. సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తనదృష్టికి తేవాలని సూచించారు. వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల సిబ్బంది దురుసుగా ప్రవర్తించవద్దని, మర్యాదగా మాట్లాడి వైద్యం అందించాలని చెప్పారు.

***పాఠశాలను సందర్శించిన ఏఎంవో***

పాలమూరు, జూన్ 13: మహబూబ్‌నగర్‌లోని గాంధీరోడ్ పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ పరిశీలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రార్థన చేయించారు. అనంతరం మాట్లాడుతూ నూతన రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'ను నేటి నుంచి ప్రార్థనలో విద్యార్థులతో పాడించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని, విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

***ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య***

జడ్చర్ల (రాజాపూర్), జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తామని రాజాపూర్ మండలం తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు నూతన దుస్తులు, పుస్తకాలు అందించామన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజీజ్, రవికుమార్, శివకుమార్, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో ప్రార్థన చేయిస్తున్న ఏఎంవో శ్రీనివాస్

***కొనసాగుతున్న బడిబాట***

మక్తల్, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అందులో భాగంగానే గురువారం మక్తల్ మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాలలో తిరిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

***విద్యార్థులకు దుస్తుల పంపిణీ***

మూసాపేట, జూన్ 13 : అడ్డాకుల మండలంలోని గుడిబండ యూపీఎస్, పొన్నకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఎంపీపీ నాగార్జునరెడ్డి దుస్తులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బాలీశ్వరమ్మ పాల్గొన్నారు.

***పాఠ్యపుస్తకాలు పంపిణీ..***

భూత్పూర్, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందుతుందని ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మద్దిగట్ల యూపీఎస్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

***ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య***

నవాబ్‌పేట, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లింగంపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద విద్యార్థులు విద్యావంతులు కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని వసతులు సమకూరుస్తోందన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని రాణించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ మాడెమోని నర్సిములు, నాయకులు చెన్నయ్య, పద్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దేవరకద్ర : విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగార్జునరెడ్డి



లింగంపల్లిలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి

## కబ్జాకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవాబ్‌పేట, జూన్ 13: మండల కేంద్రం శివారులో రైతుల భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నవాబ్‌పేట బస్టాండ్ చౌరస్తాలో పలువురు నాయకులు, బాధిత రైతులు గురువారం ధర్నా చేపట్టారు. దశాబ్దాలుగా తాము భూమిని నమ్ముకొని బతుకుతున్నామని, కొంతమంది ఆ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించడం దారుణమని, అధికారులు ఈ భూ కబ్జాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, అంజయ్య, తిరుపతయ్య, శ్రీను, ఆనంద్, అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు, జూన్ 13: మహబూబ్‌నగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న ఐదు జూనియర్ కళాశాల, పాఠశాలల్లో బోధించుటకు అతిథి అధ్యాపకుల దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ప్రాంతీయ సమన్వయ అధికారి వాణిశ్రీ తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధించ గల అర్హులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. నేడు రాంరెడ్డిగూడ పాఠశాలలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు డెమో నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు జిరాక్స్ జతను తీసుకురావాలన్నారు.

## స్వల్పంగా పెరిగిన మొక్కజొన్న ధర

జడ్చర్ల, జూన్ 13: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. యాసంగి ప్రారంభంలో క్వింటా రూ. 2,200 ఉండగా, ప్రస్తుతం రూ.2,467కు చేరింది. మార్కెట్‌కు 400క్వింటాళ్ల మొక్కజొన్న అమ్మకానికి రాగా, క్వింటా గరిష్ఠంగా రూ.2,467 పలికింది. అదేవిధంగా 137క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.2,400 పలికింది. కనిష్ఠంగా రూ.2,089, మధ్యస్తంగా రూ.2,109ధర పలికింది. 44క్వింటాళ్ల హంసరకం ధాన్యం అమ్మకానికి రాగా, క్వింటా గరిష్ఠంగా రూ.1,907 పలికింది. 6క్వింటాళ్ల ఆముదాలు అమ్మకానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.5,706 పలికింది.

## ఎన్టీఆర్ కళాశాలలో ఘనంగా స్వాగతోత్సవం





విద్యార్థులను ఆశీర్వదిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

పాలమూరు, జూన్ 13: మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వాగతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్ మాట్లాడుతూ రెండు, మూడో సంవత్సరం విద్యార్థినులకు తరగతులు ప్రారంభమైనందున క్రమం తప్పకుండా హాజరుకావాలని చెప్పారు. అలాగే ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ఏవిధంగా పొందాలనే విషయాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థినుల చేతులను గోరింటాకుతో అలంకరించి, పూలతో ఆశీర్వదించారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కన్వీనర్ వాసంతి, వైస్‌ప్రిన్సిపాల్ అమీనాముంతాజ్, అకాడమీ కోఆర్డినేటర్లు లావణ్య, సూరయ్య, జబీన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.విజయలక్ష్మి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, డబ్ల్యూఈసీ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## విద్యార్థులు బాగా చదవాలి

నారాయణపేట టౌన్, జూన్ 13: కార్పొరేట్ కళాశాలలకు ఎంపికైన విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు పేరు తేవాలని బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి కృష్ణమాచారి అన్నారు. పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించి 2024-25 విద్యాసంవత్సరంలో కార్పొరేట్ కళాశాలలకు ఎంపికైన విద్యార్థులకు గురువారం బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు తొమ్మిది మంది బీసీ విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. వీరందరికీ ప్రభుత్వం ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా పరిషత్ సర్వ సభ్యసమావేశం

పాలమూరు, జూన్ 13: మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10:30నిమిషాలకు జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో రాఘవేంద్రరావు తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవాబ్‌పేట, జూన్ 13: మండలంలోని కారుకొండ, తీగల్‌పల్లి, కూచూర్, ఇప్పటూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. పోలేపల్లి ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే విద్యుత్ లైన్‌కు మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా కారుకొండ, తీగల్‌పల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. అలాగే కూచూర్, ఇప్పటూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఏఈ పేర్కొన్నారు.

## రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలి

మిడ్జిల్, జూన్ 13: గిరిజన గ్రామ పంచాయతీల్లో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ గిరిజన మోర్చా నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో గిరిజనతండాలను గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. గ్రామ పంచాయతీలో రేషన్ దుకాణలు ఏర్పాటు చేయకపోవడంతో తండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని వినితిపత్రాన్ని తాసీల్దార్ రాజునాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా మండలాధ్యక్షుడు నరేశ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, బీజేపీ మండలాధ్యక్షుడు నరేందర్, లక్పత్‌నాయక్, శ్రీనూనాయక్, శంకర్‌నాయక్, హనుమంత్, శ్రీకాంత్, చందు, మల్లేశ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట), జూన్ 13 : చిన్నచింతకుంట మండలం ఫర్దీపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త జయరాం తల్లి సంతోషమ్మ గురువారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోట రాము సంతోషమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

## అసంపూర్తి పనులతో విద్యార్థులకు ఇక్కట్లు

దేవరకద్ర, జూన్ 13 : విద్యా సంవత్సరం బుధవారం నుంచి ప్రారంభమైనా మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులతోపాటు తరగతి గదులు ఇంకా సిద్ధం కాలేదు. పాఠశాలలు ప్రారంభమై రెండు రోజులు గడుస్తున్నా అసంపూర్తి పనులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



దేవరకద్రలోని పాఠశాలలో చేపడుతున్న పనులు